# స్త్రీలకు విద్యనందించాలి

- ప్రతి ఒక్కరి విజయం వెనుక ఓ మహిళ ఉంటుంది
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



హాజరైన మహిళా ఉద్యోగినులు

షాబాద్, మార్చి 16 : స్త్రీలకు విద్యనందిస్తే ఆర్థిక స్వావలంబన అదే వస్తుందని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖల నుంచి అత్యున్నత ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగిణులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, విద్య, క్రీడారంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను గుర్తించి మొత్తం 105 మందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి రూ.2 వేల నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఎంఎన్‌సీ కంపెనీల్లో విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో ఆర్తియాదవ్, శ్రీయ, గాయత్రిలను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టక్ శశాంక మాట్లాడుతూ స్త్రీలు వంద రూపాయల సంపాదన కలిగిన ఇంటి నుంచి అధిక ఆదాయం కలిగిన ఇంటిని కూడా చాలా చక్కగా మేనేజ్ చేయగలరన్నారు. విద్యా, ఆర్థిక స్వావలంబన అనేవి స్వతంత్రానికి రెండుపాదాలని, స్త్రీలకు విద్యనందిస్తే ఆర్థిక స్వావలంబన అదే వస్తుందన్నారు. అందుకోసం స్త్రీలు, ఆడ పిల్లలకు సరైన విద్యనందించాలన్నారు. ప్రతి ఒక్కరి విజయం వెనుక ఓ మహిళ ఉంటుందని, నా విజయం వెనుక నా మాతృమూర్తి ఉందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని.. సొంత సంపాదన, సొంత ఆలోచనలతో ముందుకు దూసుకెళ్లాలన్నారు. పిల్లల చదువు విషయంలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత, జిల్లా సంక్షేమాధికారిణి పద్మజారమణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, పిల్లల సంరక్షణ సంఘం సభ్యులు, సఖీకేంద్రం, జిల్లా మహి ళా సాధికారత కేంద్రం, జిల్లా పిల్లల సంరక్షణ కేంద్రం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ మహిళా అధికారిణిగా రాగమ్మ



కలెక్టర్ శశాంక నుంచి ప్రశంసాపత్రాన్ని పొందుతున్న రాగమ్మ

మొయినాబాద్ : మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న రాగమ్మకు ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. రాగమ్మను జిల్లా ఉత్తమ మహిళా అధికారిణిగా ఎంపిక చేసింది. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఆమె జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. మండలంలో 12 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆమె రైతులకు సేవలందించడంలో తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకాన్నీ రైతులకు చేరవేసి.. క్షేత్రస్థాయిలో వారు సాగుచేస్తున్న పంటలను పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తుండడంతో ప్రభుత్వం ఉత్తమ జిల్లా మహిళా అధికారిణిగా ఎంపిక చేసింది.

## బ్యానర్లు, కటౌట్లను తొలగించాలి

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఆయన వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధలను పకడ్బందీగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, 24, 48, 72 గంటల్లో నిబంధనల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లను తొలగించాలని ఆదేశించారు. 1950 ద్వారా, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, అదేవిధంగా సీ-విజిల్ యాప్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. ఎంసీసీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ధ్యానం వైపు ప్రపంచం చూపు..

భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్



కార్యక్రమానికి తరలివచ్చిన ప్రముఖులు, స్వామీజీలు, అభ్యసీలు



సమావేశంలో మాట్లాడుతున్న భారత ఉప రాష్ట్రపతి

నందిగామ, మార్చి 16: ప్రపంచం మొత్తం ధ్యానంలోని గొప్ప అనుభూతిని తెలుసుకుని ధ్యానం, ఆధ్యాత్మికత వైపు చూస్తున్నదని భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ అన్నారు. మండలంలోని కన్హాశాంతి వనం లో శనివారం రెండోరోజు జరిగిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఆయ న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానగురువు కమలేశ్ డి పటేల్ వారికి ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులతో కలిసి ఉప రాష్ట్రపతి మొక్కను నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్ర పంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఇండియాలో ఉండడం గొప్ప విషయమని, కన్హాశాంతివనం ఆధ్యాత్మికతకు విశ్వవిద్యాలయంగా నిలిచిందన్నారు. ఈ సం దర్భం గా శ్రీరామ చంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ నెస్, కేంద్ర సాంస్కృతిక శాఖను ఆయన అభినందించారు. ప్రపంచంలోని అన్ని మతా లు, వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్ర పంచ శాంతి కోసం ఆధ్యాత్మిక మహోత్సవాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ దేశాల నుంచి ప్రముఖులు, అభ్యసీలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరాగా.. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శంకర్, వివిధ దేశాలు, ప్రాంతాల నుంచి వచ్చిన ఆధ్యాత్మిక స్వామీజీలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్‌ను పాటించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వికారాబాద్, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో పార్లమెంట్ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నుంచే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున తక్షణమే పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు , వివిధ రకాల ప్రచార సామగ్రిని తొలగించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏ ఒకరి నుంచి ఫిర్యాదు రాకుండా చూడాలని.. ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్‌తోపాటు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను మీడియాతోపాటు, అన్ని పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని తెలిపారు. ప్రజాప్రతినిధ్య చట్టం కింద 129 సెక్షన్‌పై అందరికీ అవగాహన కల్పించాలని, శాంతిభద్రతలు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బందోబస్తు ప్రణాళిక, ఎన్నికల వెబ్‌పోర్టల్ అప్‌డేట్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, సర్ఫరాజ్ అహ్మద్ లు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ,ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, డీఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే క్రమంలో అనుమతులు పొందాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఎస్ఎస్‌టీ, వీఎస్టీ తదితర బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని.. అవసరాన్ని బట్టి వాటిని పెంచుతామన్నారు. ఇప్పటికే 208 లైసెన్స్ ఆర్మ్స్ డిపాజిట్ చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ , ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, వాసుచంద్ర పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉండొద్దు..

లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ కూడా ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు ఉండరాదని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రారంభోత్సవాలు సమావేశాలు జరుగకుండా చూడాలన్నారు. ఇంజినీరింగ్‌కు సంబంధించిన పనులను కొనసాగించాలని సూచించారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు నేటి నుంచే పని చేయాలని సూచించారు. ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంసీసీ బృందాల వాహనాలకు జీపీఎస్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు ఓటరు జాబితా లో ఫామ్ 6, 7, 8 పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు.

### టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగనున్న పరీక్షలకు జిల్లాలో 80 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 5 నిమిషాలు ఆలస్యంగా అనగా ఉదయం 9.35 వరకు విద్యార్థులను కేంద్రాల్లో అనుమతిస్తారని.. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలు, పరిసరాల్లో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఏమైనా సందేహాలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని 08416 -235 245 ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. పరీక్షలకు బాలురు 6913, బాలికలు 6499 మొత్తం 13,412 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.



### సీఎంఆర్‌ను నిర్దేశించిన సమయంలోగా అందించాలి

వికారాబాద్, మార్చి 16 : ఖరీఫ్ 2023-24కు సంబంధించిన సీఎంఆర్‌ను నిర్దేశించిన సమయంలోగా ఎఫ్‌సీఐకి అందించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. శనివారం ఖరీఫ్ 2023-24కి సంబంధించిన సీఎంఆర్‌పై అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాలశాఖ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 సీజన్ ఖరీఫ్ సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి సకాలంలో పంపించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# సీడీపీ నిధుల కోసమే సీఎంను కలిశా..

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు..
- తాను పార్టీ మారుతున్నాననే ప్రచారం అవాస్తవం
- విలేకరుల సమావేశంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, మార్చి 16 : సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి ఫండ్స్) నిధుల కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్లలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాను పార్టీ మారుతున్నట్లు కొన్ని మీడియాల్లో ప్రచారం చేస్తున్నారని, అలాంటిది ఏమి లేదని, పార్టీ మారడం పూర్తిగా అవాస్తవమన్నారు. నియోజకవర్గానికి 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీడీపీ నిధులు రూ.3కోట్లు ఆపేశారని, ఈ విషయమై అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ప్రపోజల్స్ ఇచ్చామన్నారు. తన ప్రతిపాదనలను కలెక్టర్ తీసుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సంతకాలు చేసి ఇచ్చారన్నారు. అప్పుడున్న కలెక్టర్ దానిపై సంతకం చేయకపోవడంతో అలాగే పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్నికల కంటే ముందే వెళ్లి అడిగితే ఎన్నికల తర్వాత మాట్లాడుతామని చెప్పారని.. ఎన్నికల తర్వాత వెళ్లి అడిగితే ఆ లెక్క అక్కడికే ముగుస్తుందని చెప్పినట్లు తెలిపారు. ఇంకా నాలుగు నెలల సమయం ఉందని నిధులు కేటాయించాలని అడిగితే.. ప్రభుత్వం నుంచి సీడీపీ నిధులను ఆపాలని చెప్పారని.. ఈ విషయంపైనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రులను, మంత్రులను కలవడం సహజమని.. కానీ మీడియా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నదన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి నాకు ఏమి చెప్పలేదని, నేను కూడా ఆయనతో ఏమి మాట్లాడలేదన్నారు. తనపై జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తమన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటే జీవితాంతం ఉంటానని ఎమ్మెల్యే యాదయ్య స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు దేశమళ్ల ఆంజనేయులు, మర్పల్లి కృష్ణారెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, గిరిధర్‌రెడ్డి, శివప్రసాద్, గోపాల్, ఆయా మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములు లాక్కోవాలని చూస్తే ఊరుకోం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

బొంరాస్‌పేట, మార్చి 16 : ఫార్మా విలేజ్ ఏర్పాటు పేరుతో రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు హెచ్చరించారు. శనివారం దుద్యాల మండలంలోని హకీంపేటలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్లకుంట తండాల్లోని 1,274 ఎకరాల వ్యవసాయ భూముల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో రైతులు సాగు చేసుకుంటున్న భూములను తీసుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రైవేట్ కంపెనీల కోసం భూములను తీసుకోవాలంటే 80 శాతం మంది రైతులు ఆమోదం ఉండాలని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు కంపెనీల ఏర్పాటు పేరుతో రైతుల నుంచి భూములను తీసుకుని.. ఆ ప్రాంతంలో ఇప్పటివరకు ఒక్క కంపెనీని స్థాపించలేదని.. నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వకుండా పేదలకు నష్టం చేశారని వెంకట్రాములు ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతూన్న మంద కృష్ణ మాదిగ

చేవెళ్లటౌన్, మార్చి 16 : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు ప్రసరిస్తాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగ, ఉపకులాల సదస్సు మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎంఎస్‌పీ మహాజన సోషలిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బాబుమాదిగ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో నిండిన చీకటి తొలగి వెలుగు వస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరుగకపోవడంతోనే విద్యా ఉద్యోగాల్లో మాదిగలకు చాలా అన్యాయం జరుగుతున్నదన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుంచే మాలలు రాజకీయంగా ముందు వరుసలో ఉన్నారన్నారు. మాదిగలను రాజకీయ పార్టీలు పట్టించుకోకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. కొన్నేండ్లుగా జరుగుతున్న ఉద్యమాన్ని గుర్తించిన ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని.. అందులో భాగంగానే కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్‌గోబా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసి వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేసేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. అందువల్ల ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ అంతిమదశకు చేరిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగా, ప్రవీణ్ కుమార్ మాదిగా, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రావుమాదిగా, ఎంఎస్‌పీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున మాదిగా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 623 కేసులు పరిష్కారం

వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్




సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

వికారాబాద్, మార్చి 16 : రాజీమార్గమే రాజమార్గమని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 623కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. మోటర్ వెహికిల్ ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, భూ తగాదాలు, భార్యాభర్తల కేసులు, కొట్లాటలు తదితర కేసుల్లో ఇరువురు రాజీ పడ్డారు.

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ రాజీపడితే ఒకరు ఓడి ఒకరు గెలిచినట్లు కాదని.. ఇరువురు గెలిచినట్లేనని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్ , సీనియర్ సివిల్ న్యాయమూర్తి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రెటరీ డిబి శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శ్రుతిదూత, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్, అన్వేశ్‌సింగ్, సమీనాబేగం, వికారాబాద్ బార్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, న్యాయవాదులు నాగరాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్, రాము, రాజశేఖర్, రాజు, తులసీరామ్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలి



సమావేశానికి హాజరైన నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు

వికారాబాద్, మార్చి 16 : ఎన్నికలకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వికారాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నోడల్ అధికారులు విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలను ఒక సెక్టార్ చొప్పున 25 మంది సెక్టోరల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటికే సెగ్మెంట్‌లో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ అకౌంట్స్ టీంలతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. సమావేశంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సెగ్మెంట్ నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## అడికిచెర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో సాసర్ పిట్ ఏర్పాటు



పెద్దేముల్, మార్చి 16: ఎండాకాలం దృష్ట్యా వన్యప్రాణుల దాహాన్ని తీర్చేందుకు సాసర్ పిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాండూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అడికిచెర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో సాసర్ పిట్‌ను ఏర్పా టు చేసి అందులో ట్యాంకర్ ద్వారా నీటిని నింపినట్లు తెలిపారు. అటవీ ప్రాంతం నుం చి ఎవరైనా అనుమతులు లేకుండా కలపను అక్రమంగా రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడికిచెర్ల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.